ఘంటారావం

The Hunchback of Notre Dame

విక్టర్ హ్యూగో

ప్రపంచ ప్రఖ్యాత నవల

ఘంటారావం

(The Hunchback of Notre Dame)

మూలం:

విక్టర్ హ్యూగో

అనువాదం :

సూరంపూడి సీతారాం

హైదరాబాద్ బుక్ ట్రస్టు

ధర	:	రూ. 100/-
మొదటి ముద్రణ	:	ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రిక నుండి సీరియల్‌గా వచ్చి, తరువాత ఆంధ్ర గ్రంథమాల, చెన్నై, 1954లో ప్రచురించబడినది.
హెచ్.బి.టి తొలి ముద్రణ	:	జూన్, 2011
ప్రతులకు, వివరాలకు	:	హైదరాబాద్ బుక్ ట్రస్ట్, ప్లాట్ నెం. 85, బాలాజీ నగర్, గుడిమల్కాపూర్, హైదరాబాద్ - 500 067 ఫోన్ : 23521849 www.hyderabadbooktrust.blogspot.com

ముద్రణ	:	అనుపమ ప్రింటర్స్, గ్రీన్ వ్యూ, 126 శాంతినగర్, హైదరాబాద్ - 28 ఫోన్ : 23391364, 23304194

ముందుమాట

విక్టర్ హ్యూగో (1802–85) సాటిలేని మేటి ఫ్రెంచి రచయిత. ఇతిహాసాల స్థాయిలో నవలలు రాసి విశ్వ సాహిత్యంలోనే వన్నెకెక్కాడు. అతని "లే మిసరాబ్లు" (అంటే 'బీదల పాట్లు')కి సాటిరాగల నవలలు ఎన్నో వుండవు. విశ్వసాహిత్య పరిశీలకులు ఒకే గొంతుకతో ఒప్పుకునే మాట ఇది. ఆ మాటకొస్తే అటు విప్లవాలలోనూ, ఇటు సాహిత్య రంగంలోనూ కూడా ఫ్రాన్స్‌ది ఎప్పుడూ పైచేయి. అందుకే ఫ్రాన్స్‌ని 'విప్లవాల ఉయ్యాల' అన్నారు. ఇంచు మించు అన్ని సాహిత్య సిద్ధాంతాలకి పుట్టినిల్లు ఫ్రాన్స్. మనందరం వీటిని మరీ మరీ మననం చేసుకోవాలి.

వోల్టేర్ (1694–1778) అంటేనే 18వ శతాబ్దం అని విక్టర్ హ్యూగో వేనోళ్ళ కొనియాడాడు. మన సంప్రదాయక పరిభాషలో వోల్టేర్ శతాధిక గ్రంథకర్త. సమాజాన్ని తన రచనలతో ఉగ్రూతలూపాడు. ఇతని రచనలు కేవలం సాహిత్యరంగానికే పరిమితమైనవి కావు. సామాజిక, సాంస్కృతిక, చారిత్రక, తాత్విక రంగాలన్నింటినీ తరచి తరచి విస్తారంగా రాశాడు వోల్టేర్. వోల్టేర్ కృషిని 19వ శతాబ్దంలో పుణికిపుచ్చుకున్నవాడు విక్టర్ హ్యూగో.

టూకీగా చెప్పాలంటే ఈ ఘంటారావం నవల (1830) పదిహేనవ శతాబ్దపు 'పారిస్' నగరాన్ని పునరుజ్జీవింప చేసింది. ఫ్రెంచి సాహిత్యం సామాజిక జీవితంతో, చరిత్రతో పెనవేసుకుపోయింది. అందుకే కారల్‌మార్క్స్ అంతటివాడు 'నేను ఫ్రాన్సు చరిత్రని ఫ్రెంచి సాహిత్యం నుంచి తెలుసుకున్నాను' అని కీర్తించాడు. ఇది తక్కువ విషయం కాదు. సాహిత్యం ఎప్పుడూ నేల విడిచి సాము చేయదు. జీవితంలో ఊహలతో, సామాజిక జీవిత చిత్రణతో, చారిత్రక అంశాలన్నింటితో పడుగూ, పేకలాగా పెనవేసుకుపోతుంది. దీనికి ప్రత్యక్ష తార్కాణంగానే మన చెవుల ముందు ఈ 'ఘంటారావం' గణగణా మోగుతోంది. అందరం ఆలకిద్దాం. పునరుజ్జీవనం పొందిన పారిస్ నగరాన్ని కళ్ళారా చూద్దాం.

"పారిస్ నగరం ఒక జంత్రవాద్య సమ్మేళనం. ప్రభాత ఘంటా నినాదం. ఒక అద్భుతగాన విశేషం. ఇటువంటి అద్భుతమైన నగరం ప్రపంచంలో అరుదు.

క్లోద్‌ఫ్రాలో, క్వాసిమోడో – ఇటువంటి ఇద్దరు విచిత్ర మానవుల అధీనంలో ఉన్న నోత్ర్‌దామ్ చర్చి పట్ల పారిస్ నగరవాసులకు భీతి, శంక జనించాయి."

వీటి విశ్వరూపం, సారాంశం తెలియాలంటే ఈ నవలని వెంటనే చదవండి.

- చలసాని ప్రసాద్

24–4–2011

అనాకారి జయధ్వానం

అక్కడ జేరిన మూర్ఖులు, బికారులు, జేబు దొంగలు మొదలైన ప్రవీణులంతా చుట్టుపక్కల వెదికి, అట్ట ముక్కలతో ఓ కిరీటం తయారుచేసి, చెక్కముక్కల పల్లకీ ఒకటి తెచ్చారు. 'మూర్ఖాగ్రేసరునికి' ఆ కిరీటం ధరింపజేశారు. క్వాసిమోడో అడ్డు చెప్పలేదు. పైగా ఆ కిరీటం ధరించి పల్లకీ అనే బల్ల మీద ఠీవిగా కూర్చున్నాడు. పన్నెండు మంది మూర్ఖులు ఆ పల్లకీ ఎత్తారు. పొలి కేకలతో బొబ్బలతో జనమంతా మూర్ఖాగ్రేసరుని ఊరేగింపుతో నగర వీధుల వెంట బయలుదేరారు.

ఇలా 'ఫూల్స్ ఫెస్టివల్'తో కోలాహలంగా మొదలవుతుంది. మూర్ఖాగ్రేసరుడైన క్వాసిమోడో విషాదాంతమైన విజయయాత్ర. దాదాపు రెండు శతాబ్దాలుగా పాఠకుల హృదయాల్లో ఉద్వేగాల ఉరవడి సృష్టిస్తూ.. అడుగడుగునా సంభ్రమం, విభ్రమాలతో ఉక్కిరిబిక్కిరి చేస్తూ... అదలా సాగుతూనే ఉంది.

❊ ❊ ❊ ❊

ప్రపంచ సాహిత్యంలో పేరెన్నికగన్న రచనల్లో ఒకటిగా నిలిచిపోయిన 'హంచ్‌బాక్ ఆఫ్ నోత్ర్‌దామ్'కు తెలుగు అనువాదం ఈ ఘంటారావం. సుప్రసిద్ధ ఫ్రెంచ్ రచయిత విక్టర్ హ్యూగో 1830లలో రాసిన నవల ఇది. దాదాపు రెండు శతాబ్దాలు కావొస్తున్నా ఇప్పటికీ ఈ నవలకు ప్రభ తగ్గలేదు. దాదాపు ప్రపంచంలోని ప్రధాన భాషలన్నింటిలోకీ అనువాదమైంది. దీని ఆధారంగా 1905లో మూకీలతో మొదలుకొని ఇప్పటివరకూ ప్రతి తరంలోనూ సినిమాలు తీస్తూనే ఉన్నారు. ఇక టీవీ సీరియళ్లు, నాటకాలు, రేడియో అనుసరణలు, సంగీత రూపకాలకు లెక్కలేదు. 1997లో పిల్లల కోసం వాల్ట్‌డిస్నీ దీన్ని విజయవంతమైన యానిమేషన్ చిత్రంగా కూడా తెచ్చింది. నిజానికి పౌరాణిక గాథలకు తప్పించి ఒక కాల్పనిక రచనకు శతాబ్దాలుగా ఇంతటి ప్రాభవం, ఆదరణ లభించటం అరుదనే చెప్పాలి. దీనికింత వైభోగమెందుకు? ఏమిటి దీని ప్రత్యేకత?

❊ ❊ ❊ ❊

చారిత్రకంగా 'హంచ్‌బాక్' పుట్టుకే ఓ బలీయమైన సందర్భం. ఫ్రెంచ్ విప్లవం రాజకీయంగా, సామాజికంగా మనిషి ఆలోచనా ప్రపంచాన్ని అనూహ్య మలుపులు తిప్పిన సమయం అది. మరోవైపు సాహిత్య, కళారంగాల్లోనూ అప్పుడే కొత్త అలలు రేగుతున్నాయి. సృజనశీలతపై నీళ్లు జల్లే సంప్రదాయిక కట్టడి నియమాలతో విసిగిపోయి.. సమకాలీన యుగపు భావ విప్లవానికి పట్టం కడుతూ 'కాల్పనిక వాదం' ముందుకొస్తోంది. పౌరాణిక

గాథల 'క్లాసికల్' చట్రాలను ఛేదించుకుని.. మనిషికీ, అతని వ్యక్తిగత అనుభవానికీ, ఊహాశక్తికి, ఉద్వేగానికి పట్టం కడుతూ 'రొమాంటిసిజం' పురుడుపోసుకుంది. ఈ యుగ లక్షణాల్ని తన రచనల్లో ఉత్కృష్టమైన స్థితికి తీసుకువెళ్లిన ముఖ్యుడు హ్యూగో. ఫలితంగానే... ప్యారిస్‌లోని పురాతన నోత్రదామ్ చర్చిలో గంటలు కొట్టుకొని బతికే ఓ అనాథ, అనాకారి, మూర్ఖాగ్రేసరుడు... మనకీ నవలా నాయకుడయ్యాడు. శారీరకంగా అతనికి లేనివి వికారం లేదు. దేహాన్ని మించిన తల, తలకంటే ఎత్తైన గూని, మూసుకుపోయిన కన్ను, తోసుకొచ్చిన పన్ను, వాలిపోయిన పెదవి, పుట్టెడు చెముడు.. ఇలా కురూపితనాన్నీ, అనాకారితనాన్నీ పరాకాష్ఠకు తీసుకువెళతాడు హ్యూగో. అప్పటివరకూ ఆజానుబాహుల్నీ, అందగాళ్లనీ, చారిత్రక, ఐతిహాసిక పురుషుల్ని నాయకులుగా గొప్పగా చెప్పుకొన్న పాఠక లోకానికి ఓ కొత్త మానవీయమైన రుచినీ, అభిరుచినీ పరిచయం చేస్తాడు.

క్వాసిమోడోను చూసిన పురుషులు ఛీత్కరించుకుంటారు. ఆడవాళ్లు భయపడతారు. అందమైన జిప్సీ యువతి ఎస్మరాల్డా కూడా అతని శారీరక లోపాల్ని చూస్తుందేగానీ మానసిక సౌందర్యాన్ని దర్శించలేకపోతుంది. జాలి పడుతుందేగానీ ప్రేమ కురిపించలేకపోతుంది. కానీ ఆమె జాలి అతనిలో ప్రేమను మొలకెత్తిస్తుంది. మరోవైపు తమకంతో ఆమె వెంటబడే కెప్టెన్.. మోహంతో ఆమె కోసం వెంపర్లాడే క్రైస్తవ మతాధికారి.. ఆమెను అందుకోవటం కోసం వాళ్లు ఎంతకైనా తెగించి సృష్టించే హత్యాకాండ... వారి బారి నుంచి ఎస్మరాల్డాను రక్షించేందుకు ప్రాణాలకు తెగించి క్వాసిమోడో సాగించే సాహసోపేత విఫల యత్నాలు.. ఇలా అడుగడుగునా నాటకీయతతో సాగుతూ నవల ఆసాంతం ఉద్వేగపూరిత ఘటనా పరంపరగా మన మనసుల్ని ఆవహించేస్తుంది. హ్యూగో చేతిలో పాత్రలన్నీ ఎటువంటి దాపరికాలూ లేకుండా, తమతమ బలహీనతలతో సహా సజీవంగా మన ముందు కదులుతాయి. అందం, క్రౌర్యం, ప్రేమ, హింస, మోసం, మోహం.. ఇలా మానవీయ భావాలన్నీ దట్టంగా అల్లుకుపోయి మనసుని పూర్తిగా ఆక్రమించేస్తాయి. నేరం, శిక్ష, మతం, నిష్ఠ నైతికత వంటి వ్యవస్థాత్మక భావనలన్నీ ప్రశ్నార్థకంగా నిలుస్తాయి. ఇన్ని శతాబ్దాల తర్వాత చదివినా ఏ పేజీ పేలవంగా తేలిపోదు. ఎక్కడా నవల పాతబడి, ప్రాసంగికత కోల్పోయిందన్న భావన కలగదు !

❋ ❋ ❋ ❋

ఇది విషాదాంత గాథే కావచ్చు. కానీ ఆ విషాదంలో విజయం ఉంది. ఒక్కసారి ఆఖరి ఘట్టాన్ని చూస్తే...

ఒకే గొలుసుకు వేలుడుతున్న రెండు అస్థిపంజరాలు వింత గొలిపాయి. ఒకటి స్త్రీది. ఆ అస్థిపంజరాన్ని కౌగిలించుకుని మరో అస్థిపంజరం. అదో పురుషుని కంకాళం.

దాని ఒక కాలుకంటే మరో కాలు పొట్టి. వంగిన వెన్ను అతని గూనితనాన్ని తెలుపుతోంది. ముట్టుకోగానే ఆ ఎముకలు పొడిపొడైపోయి రూపం అంతరించింది.

ఆ రూపం అంతరించిపోవచ్చుగానీ ఆ గాఢమైన కంకాళ పరిష్వంగంలోని ప్రేమదనం, వెచ్చదనంలో.. ఆ సమాధి నిశ్శబ్దంలో.. క్వాసిమోడో మోగించిన ఘంటానాదం ఎక్కడో లోలోపల ఇప్పటికీ వినిపిస్తున్నట్లే ఉంటుంది. చర్చి గంటలు మోగించీ మోగించీ క్వాసిమోడో బధిరుడైపోయి ఉండొచ్చేమోగానీ... ఈ 'ఘంటారావం' చదివిన తర్వాత ఉద్వేగాల ఉప్పెన అనంతరం శాంతించిన సముద్ర గర్భంలా మన మనసు నిర్మలమైపోతుంది. మనకు తెలియకుండానే కళ్లు కాస్త చెమ్మగిల్లి, ఓ చిన్న నీటి బిందువు తయారైతే... అది ఆ అర్భక అనాకారి హృదయంలోని 'అకళంకిత' ప్రేమ సాధించిన విజయమే అవుతుంది. అనువాద కళలో సిద్ధహస్తులు సూరంపూడి సీతారాం తెలుగు పాఠకుల కోసం దాదాపు అరవై ఏళ్ల క్రితం (1954లో) చేసిన అనువాదం ఇది. దీన్ని ఇప్పుడు పునర్ముద్రించి మీ ముందుంచుతున్నాము.

హైదరాబాద్ బుక్ ట్రస్ట్

జూన్ 2011

1482 జనవరి 6వ తేది. ఆనాడు ప్రభాతవేళ పారిస్ నగరవాసులు నగరం నలుమూలలనుండీ వినవచ్చిన దేవాలయ ఘంటారావానికి మేలుకొన్నారు. అరుణోదయ సమయానికే నగరం కోలాహలంతో సంచలితమయింది. అయితే ఈ కోలాహలానికి చరిత్రకెక్కిన హేతువేదీలేదు. తిరుగుబాటూ జరగలేదు. దాడి జరగలేదు. ఫ్లాండర్స్ నుంచి రాయబారులు వచ్చినది రెండు రోజుల క్రిందట. ఫ్రెంచ్ రాజకుమారునికి ఫ్లాండర్స్ రాకుమార్తెతో వివాహం ఏర్పాటు చేయడానికొచ్చారు రాయబారులు. మహారాజు ముఖం చూసి, ఫ్లాండర్స్ రాజవంశం పట్లగల జుగుప్సను లోలోపలే అణచుకొని, బూర్బోన్ కార్డినల్ రాయబారులకు హోరుమని వర్షం కురిసేసమయంలో విందుచేశాడు. కాని నేటి కోలాహలానికి ఆ రాయబారం కారణంకాదు.

పారిస్ నగరవాసులకు ఈ రోజున రెండు విధాల పండుగ: క్రీస్తుదేవుడు అవతరించిన శుభవార్త మేజై దివ్యజ్ఞానులకు తెలియవచ్చినది జనవరి 6వ తేదీని. రెండోది బికారుల పండుగ. బికారులందరూ చేరి 'మూర్ఖాగ్రేసరుడు' ఒకణ్ణి ఎంచుకుని ఉత్సవం జరుపుకుంటారు. ఈ రోజున గ్రీవ్ మైదానంలో బాణాసంచా కాలుస్తారు. న్యాయస్థాన ప్రాంగణంలో నాటకమొకటి ప్రదర్శిస్తారు.

ఉదయమే ఇళ్లు, అంగళ్లు మూసి నగరవాసులు వీధులలో సంచరించ నారంభించారు. గ్రీవ్ మైదానం, న్యాయస్థాన ప్రాంగణం కిటకిటలాడుతున్నాయి. నాటకానికి ఫ్లాండర్స్ రాయబారుల్ని ఆహ్వానించారని తెలియవచ్చింది. అక్కడే మూర్ఖాగ్రేసరుని ఎన్నిక కూడా జరుగుతుంది. అందువల్ల ప్రజలు ఎక్కువగా అక్కడే గుమిగూడుతున్నారు?

న్యాయస్థానం భవనంలో ఒక పెద్ద సభామందిరం ఉంది. ఇంత పెద్ద మందిరం ప్రపంచంలో మరెక్కడా లేదని ప్రతీతి. అయినా ఈ రోజున ఆ మందిరం ప్రవేశించడం అతి కష్టం. మేడలపై కిటికీలలోనుంచి చూసేవారికి అక్కడి జనసమూహం, ఒక మహాసాగరంలా కనపడుతుంది. అయిదారు విశాల మార్గాలగుండా వచ్చి చేరే జనాన్ని చూస్తే, అయిదారు సజీవనదులు మహాసాగరంలో కలుస్తున్నట్లనిపిస్తుంది. ఎప్పటికప్పుడు కొత్తగా వచ్చిపడుతున్న జనప్రవాహంతో సాగరం కల్లోలితమై తరంగాలు జనించినట్లు జనసమూహాలు కదలాడుతున్నాయి. ఈ సాగరతరంగాలు స్తంభాల నొరసికొని కుడ్యాలను తాకి, సోపానాలను చుట్టి ఉబుకుతున్నాయి. పురాతన శిల్ప ప్రాభవాన్ని ఎల్లెడలా ప్రదర్శిస్తున్న సభామందిరం మధ్యభాగంలోకల సోపాన పంక్తులనుండి సరస్సులోనికురికే జలపాతాలవలె జనం దిగుతున్నారు. ఆ విశాల మందిరంలో ఉద్భవిస్తున్న జనఘోష

అపారం. మధ్యమధ్య ప్రభుత్వసైనికులు జనసందోహాన్ని అరికట్టడానికి వృధా యత్నాలు చేస్తున్నారు.

ప్రతి గవాక్షం, ప్రతి ద్వారం, ప్రతి ఆవాసం, మిద్దెలు, ఇళ్లకప్పులు అన్నీ జనంతో నిండి ఉన్నాయి. పైనుండి అందరూ విభ్రాంతులై ప్రజాసమూహాన్ని గమనిస్తున్నారు. కన్నులు చెదరి పోతున్నాయి. చెవులకు ఒకే ఒక్క ఘోష తప్ప మరేమీ వినరావడంలేదు.

సభామందిరమంతటా బ్రహ్మాండమైన ఏడు స్తంభాలున్నాయి. నాలుగు స్తంభాలకు చుట్టూ తళతళ మెరిసే ఆభరణాలతో నిండిన అంగళ్ళున్నాయి. మూడు స్తంభాలవద్ద అరిగిపోయిన బల్లలూ కుర్చీలూ వున్నాయి. గోడలపైన ఆదినుంచి నేటివరకూ ఫ్రాన్స్ దేశాన్ని పరిపాలించిన మహారాజుల చిత్రాలూ, శిల్పాలూ అలంకరించబడి ఉన్నాయి. కిటికీల తలుపులు, ఊర్ధ్వగవాక్ష ఫలకాలు అనేక వర్ణాలలో మెరిసిపోతున్నాయి. మందిర కుడ్యాలు, చిత్రాలు, స్తంభాలు అన్నీ స్వర్ణ నీల వర్ణాలలో మేళవించబడినాయి.

ఆనాడు విభ్రాంతి కలిగించిన ఈ మహామందిరం నేడు (రచయిత జీవితకాలానికి, అనగా 19వ శతాబ్దానికి) లేదు. 1618లో ఇది దగ్ధమైపోయింది. ఇందుకు కారణం నాలుగో హెన్రీ హత్య. ఆ హత్య జరిగివుండకపోతే, హత్యానేర విచారణకు సంబంధించిన పత్రాలు ఈ మందిరంలో పదిలపరచవలసిన అవసరం లేకపోయేది. అవి ఇక్కడే పదిలపరిచినందువల్ల ఆ పత్రాలను నాశనం చేయగోరిన వారు 1618లో మందిరాన్నే అగ్నికాహుతి చేశారు. “అడుగు వెడల్పు, అడుగున్నర పొడవూ కల ఒక అగ్నిశిఖ ఆకాశాన్ని చీల్చుకొని వచ్చిపడిందని”, అందువల్ల మందిరం దగ్ధమైపోయిందని కొందరంటారు. ఏమైతేనేం, ఇప్పుడు ఆ మందిరం లేదు. తిరిగి దాన్ని పునరుద్ధరించడానికి అనేక యత్నాలు జరిగాయి. కాని పూర్వశోభను ఎవరూ పునరుద్ధరించలేకపోయారు. మందిరంతోపాటు చరిత్ర ఘట్టాలను జ్ఞప్తికి తెచ్చే అనేక శిల్పాలు, వేదికలు ఇప్పుడు లుప్తమైపోయినాయి.

చతురస్రాకారం కల ఈ మందిరంలో ఒక చివర పెద్ద పాలరాతి తిన్నె ఉంది. ఇది ఏకశిలాఖండం. మరొక చివర గోడనానుకుని ఎత్తున కట్టిన ఒక పెద్ద వేదిక ఉంది. ఈ వేదికకు వెనుక చిన్నద్వారం. ఈ ద్వారంగుండానే అతిథులు వచ్చి వేదికనలంకరిస్తారు.

పాలరాతి తిన్నెపై నాటకప్రదర్శనం జరుగుతుంది. తిన్నె వెనుకభాగంలో చెక్కలతో కట్టి పరదాలతో కప్పి చిన్నగది ఒకటి తయారుజేశారు. ఎత్తైన ముందు భాగం రంగస్థలం. గదిలోనుంచి రంగస్థలానికి రాకపోకలు మాత్రం బహిరంగమే. మధ్య నిచ్చెన వెయ్యబడి ఉంది.

పన్నెండు గంటలకుగాని నాటకం ప్రారంభం కాదు. రాయబారులరాక ఆలస్యమౌతుండటంవల్ల జాప్యం జరుగుతుంది.

మందిరంలో చేరిన వేలాది ప్రజలు ఉదయంనుంచి వేచివున్నారు. కొందరు తెల్లవారకముందే చలిలో గజగజలాడుతూ వచ్చి మందిర ప్రాంగణంలో కాచుకున్నారు. క్షణక్షణానికీ సమూహం పెరుగుతూనేవుంది; జరుగుతున్న జాప్యానికి ప్రజల విసుగుదల హెచ్చుతూవుంది. సహనం తగ్గి తగవులెక్కువ కాసాగినాయి. అల్లరి పెరుగుతూ వుంది. మధ్యమధ్య అందరూ పొలికేకలు పెడుతున్నారు. ఫ్లాండర్స్ రాయబారులపట్ల దూషణ, తిరస్కారాలు వినరాసాగినాయి. మధ్య మధ్య నడయాడుతున్న విద్యావంతులు నిరసనతో నవ్వుతున్నారు. సామాన్య జనం మొరటుహాస్యాలకు దిగుతున్నారు. ఒకడు ఒక కిటికీనెక్కి గాజుతలుపు బద్దలుకొట్టి సుఖాసనం ఏర్పరచుకున్నాడు. అతడిని చూసి మరికొందరు కిటికీల నెక్కారు. కిటికీలనెక్కినవారు ఇటు మందిరంలోనివారితోనూ, అటు ప్రాంగణంలో నిలిచిపోయినవారితోనూ నవ్వుతూ పేలుతూ సంభాషణ సాగిస్తున్నారు.

“ఓహో నువ్వెప్పుడొచ్చావోయ్! కాళ్ళు ఎక్కడానించావ్?”

“అబ్బ ! నాలుగు గంటలనించి నిలబడుతున్నానిక్కడ. నా పాదాలు దేనిమీద ఆనుకున్నాయో నాకిప్పుడు తెలియడంలేదు.”

“కిందటి తడవ నాటకం మీరు చూశారా ? అందులో పాటలెంత చక్కగా ఉన్నాయి!”

“అవునవును. రాజుగారు డబ్బు సంచులు దిమ్మరించారు.”

“అవును. డబ్బు దిమ్మరించకేంచేస్తారు ? మన సొమ్ము...”

“దైవప్రార్థన కోసం వేలు గుమ్మరించలేదా ?”

“వేలు గుమ్మరించకపోతే రాజుగారి ఆరోగ్యం ఎల్లా కాపాడ్డం ?”

పకాలున కొందరు విరగబడి నవ్వారు.

ఇలాగ ప్రసంగాలు సాగుతున్నాయి. ఇంతలో అతికాయుడైన ఒకడు ముఖమల్ దుస్తులు ధరించి తచ్చాడుతూ కనపడగానే కొందరు చేతులెత్తి చూపుతూ గేలిచేశారు. అతడు తప్పించుకుని గుంపులో కలిసిపోయాడు.

“అబ్బబ్బ ! చదువుకున్న వాళ్లుకూడా అందరితో సమానంగా పేలిపోతున్నారే.”

“ఓ హో హో” అంటూ జనం పగలబడ్డారు.

తిన్నెవద్ద బాండ్ మోగింది.

“ఎవరో”

“పుస్తకాలమ్మే వాళ్లు”

“వీళ్ళ పుస్తకాలు తగలబెట్ట”

“నోరుముయ్యండి”

"చుప్"

కోలాహలం మితిమీరుతోంది.

"ఇవాళకూడా ఈ మంత్రాలేనా ?"

"మన పండగ రోజున కూడా వీళ్ళ గొడవేమిటి – తన్ని తగిలెయ్యక."

"బల్లలన్నీ పోగుచేసి చలిమంట పెట్టాలి"

"పిదపకాలం వొచ్చింది"

"అదుగో ఫాదరీ"

"రాత్రి ఎన్ని బుడ్లు ఖాళీచేశాడో"

"జూదంలో ఎంత కడిగేసుకున్నాడో."

"ఫిరంగులు పుట్టాయి. ఇంకా లోకమేమిటి! అంతానికే వొచ్చింది. "

గడియారం పన్నెండు కొట్టింది. అంతటా నిశ్శబ్దం ఆవరించింది.

అందరి తలలూ సింహద్వారం వైపు తిరిగాయి. తరువాత అతిథుల వేదికవైపు చూశారు. అక్కడ ద్వారం మూసేవుంది. వేదిక నిర్జనంగానే ఉంది. రంగస్థలం కూడా ఖాళీగా ఉంది. ఇంక ప్రజలకు ఓర్పు నశించింది. "నాటకం ! నాటకం !" అని కేకలు వేయనారంభించారు.

"సిపాయిని తన్నండి ముందు" అన్నారు కొందరు.

"అవును. పట్టుకోండి. ముందు కాపలావారల పని పట్టించండి."

ఘోష మిన్ను ముట్టింది. కాపలాదార్లు ప్రాణభయంతో గోడలమూల నక్కారు.

ఇంతలో రంగస్థలం వద్ద చలనం కలిగింది. తెర తొలగించుకుని ఒకడు రంగస్థలం మీదికి వచ్చి నిలబడ్డాడు. మళ్ళీ మందిరంలో నిశ్శబ్దం ఆవరించింది. రంగస్థలంపైన నిలిచిన పురుషుడు గజగజ వణుకుతూ వొంగివొంగి ప్రేక్షకులకు అభివాదం చేశాడు. ముఖానికి తగని పెద్దగడ్డం, గడ్డం మూసివేయగా మిగిలిన ముఖంలో ఎర్రని రంగూ, జుపిటర్ వేషం చూసేసరికి ప్రజలు ప్రశాంతులైనారు. సిపాయిల ప్రాణాలు దక్కాయి.

2

వేషం చూడగానే తృప్తి చెందిన జనానికి అతడి మాటలు వినేసరికి తిరిగి ఆవేశం పుట్టింది. "రాయబారులు రాగానే నాటకం ప్రారంభమౌతుంది" అని అతడు ప్రకటించాడు.

"వీల్లేదు. వెంటనే మొదలెట్టాలి" అని కేకలు చెలరేగాయి.

"జుపిటర్‌ని దిగలాగండి. తన్నండి" అని కేకలు వేశారు. జుపిటర్ వేషధారి భయంవల్ల తడబడ్డాడు. ఏమి చెప్పాలో తోచలేదు. నాటకం ప్రారంభించకపోతే ప్రజలు చీరేస్తారు; ప్రారంభిస్తే కార్డినల్ క్షమించడు.

ఇంతలో ఒకడు రంగస్థలాన్ని సమీపించి వేషధారిని పిలిచాడు.

"జుపిటర్ నాటకం మొదలెట్టు. కార్డినల్ కోపగించకుండా నేను చూస్తాను. భయంలేదు. జనం కోరిక మన్నించి మొదలు పెట్టు" అని బిగ్గరగా చెప్పాడు. వేషధారి ఒక్క నిశ్వాసం విడిచి "అయితే నాటకం ప్రారంభమౌతుంది" అని ప్రకటించాడు. వెంటనే మందిరమంతటా చప్పట్లు మారుమ్రోగాయి. వేషధారి పరదాలోకి తప్పుకున్నాడు.

ముందుకు వచ్చిన పురుషుడు తిన్నెకింద నిలబడి జనాన్ని కలయచూశాడు. ముందు బల్లలవద్ద కూర్చున్నవారు అతనివంక చూసి ఏదో మాట్లాడుతున్నారు. అది గమనించి అతడు మెల్లిగా వారిని సమీపించాడు. ఇద్దరు స్త్రీలు మాట్లాడుతున్నారు.

"ఈ నాటకం కథేమిటో."

"జుపిటర్ వేషం వొచ్చిందిగా, ఏదో గ్రీక్ దేవతలకి సంబంధించిన కథ కాబోలు."

"నిరుడు వేసిన నాటకం బాగుంది."

అతడు ధైర్యం చేసి మాట కలిపాడు "ఇది కూడా బాగుంటుంది."

"నిజంగా ?"

"అవునండి. ఇదో కొత్తరకం నాటకం. భలేగా ఉంటుంది"

"ఇందులో ప్రేమపాటలుంటాయా ?"

"అబ్బే ! అలాటిది కాదు. ఇది నీతి బోధిస్తుంది."

"ఇంతే !"

"అయితేం ! బాగుంటుంది. ఇది నేనే రచించాను."

"ఆ !" ఇద్దరు స్త్రీలూ ఒక్కసారి అన్నారు ఆశ్చర్యంతో.

కవీశ్వరుడు వెన్ను విరుచుకుని ఒక్కసారి చూశాడు.

"మీ పేరు ?"

"పియర్ గ్రాంగ్వార్"

జుపిటర్ పరదాలోకి తప్పుకుని ఇంకా రాలేదు. ఇంతకు ముందే నాటకం కోసం అల్లరిచేసిన జనం ప్రారంభమౌతుందని తోచేసరికి కిమ్మనకుండా ఊరుకున్నారు. కాని ఎంతసేపూరుకుంటారు. మళ్ళీ అక్కడక్కడ కొందరు కేకలారంభించారు. "జుపిటర్ ! తెరయెత్తి ఊడిపడవోయ్" అని అరుస్తున్నారు.

"నాటకం ! నాటకం" అని మళ్ళీ కేకలారంభం కావడంతో వెంటనే తెర లేచింది. రంగులు పూసుకొని నలుగురు పరదాలో నించి వచ్చారు. వరుసగా నిలబడి ప్రేక్షకులకు వొంగి వొంగి అభివాదం చేశారు. ప్రజలు హర్షధ్వానం చేశారు.

వెనుకనుంచి వాద్యసంగీతం ఆగిపోయింది. నాటకం ప్రారంభమయింది. నటులు నాందికి ఉపక్రమించారు. కాని వినేదెవరు? అందరికీ వారి దుస్తులపైనే దృష్టి. నలుగురి దుస్తులూ సగం తెలుపు రంగులోనూ, సగం పసుపుపచ్చని రంగులోనూ ఉన్నాయి. అయితే ఒకరి దుస్తులనిండా బ్రొకేడ్ అలంకరణ ఉంది. ఒకరి దుస్తులు పట్టువి. ఒకరివి ఉన్ని దుస్తులు. మరొకరివి లినెన్‌తో తయారైనవి. ఇద్దరు స్త్రీలు, ఇద్దరు పురుషులు. ఒకరి కుడిచేతిలో కత్తి, ఒకరి చేతిలో బంగారు తాళపు చెవులగుత్తి, మరొకరి చేతిలో త్రాసు, ఇంకొకరి చేతిలో త్రవ్వు పార ఉన్నాయి. ఇంకా ఎవరిదేవేషమో బోధపడక పోవచ్చునని కాబోలు వారివారి దుస్తులపైన ఇలా పెద్దపెద్ద అక్షరాలు కుట్టించుకున్నారు; "నా పేరు సామంతరాజరికం," "నా పేరు మత ప్రచారం," "నా పేరు వాణిజ్యం," "నా పేరు కృషి." మతం, కృషి పురుషులు ; రాజరికం, వాణిజ్యం స్త్రీలు. పురుషుల దుస్తులు మోకాటివరకున్నాయి. స్త్రీల దుస్తులు పాదాలనంటుతున్నాయి. వాణిజ్యంతో కృషి, మత ప్రచారంతో రాజరికం చేతులుకలిపి ప్రస్తాపన పలుకుతున్నారు. నలుగురి మధ్యా ఒక 'బంగారు చేప' ఉంది. భువిలోకెల్ల సుందరి అయిన యువతికీ 'బంగారు చేప'ను బహూకరించాలని వారి ఆశయం. నలుగురూ విశ్వమంతా చుట్టి భువనసుందరికోసం గాలిస్తున్నారు. దేశదేశాల రాకుమార్తెలు, సుందరీమణులు వచ్చారు; కాని వారెవ్వరూ నచ్చలేదు. చివరకు విసిగి వేసారి, అలసిపోయి నలుగురూ ఒకచోట విశ్రాంతి తీసుకుంటున్నారు.

కథ నడక బాగానే వుంది. కవిత, ప్రసంగవిధానం, ఉత్ప్రేక్షలు, అలంకారాలు ప్రవాహంలా దొర్లిపోతున్నాయి. అయితే ప్రేక్షకసమూహం అంతలోకీ గ్రాంగ్వార్ చూపుతున్నంత శ్రద్ధ మరెవ్వరికీ లేకపోయింది. కన్నార్పక చూసి చెవులొగ్గి తదేకంగా ఆలకిస్తున్నాడు. నాటకారంభంలో ప్రేక్షకుల హర్షధ్వానాలు అతడి చెవులలో మార్మోగుతున్నాయి. నటీనటుల పల్కులలో తన భావాలు మందిరమంతటా వ్యాపించడం చూసేసరికి కవీశ్వరుడు తన్మయుడౌతున్నాడు.

కాని కవీశ్వరుని తన్మయానందం అట్టేసేపు నిలవలేదు. ఒక బికారి గుంపులోనుంచి చెదిరి వచ్చి అతిథుల వేదిక పీఠానికి క్రింద వ్రేలాడుతున్న ఒకానొక శిల్ప విశేషంపై నెక్కి కూర్చున్నాడు. కూర్చుని ప్రేక్షకుల తలలమీదనుంచి చేతులు చాపి " అయ్యా భిక్షం, బాబూ భిక్షం " అని అరువ నారంభించాడు. కవీశ్వరుని కవిత్వ సౌందర్యం గ్రహించలేక నటులవైపు చూస్తోన్న ప్రేక్షకుల దృష్టి బికారివైపు మళ్లింది. నటీనటుల ప్రసంగం నిలిచిపోయింది. బికారిని చూసి ప్రేక్షకులు నవ్వనారంభించారు. పక్షి సంతతి గుమిగూడిన వృక్షంపైకి తుపాకి పేల్చినట్లయితే సంభవించే కల్లోలం చూసినవారికి ఇప్పుడా మందిరంలో పరిస్థితి సులువుగా బోధ పడుతుంది.

"అరె వీడీమాటు చేతికి కట్టుకట్టాడే. "

"నిన్న కాలికి తగిలినదెబ్బ ఇవాళ చేతిమీదికెక్కిందోయ్. "

ఈరీతిగా కొనసాగిన ప్రసంగాలలో అందరూ నాటకాన్ని మరిచిపోయారు. ఒకడొక కాసు విలాసంగా పైకి విసిరాడు. కట్టుకట్టుకున్న చేతితో నే బికారి నేర్పుగా అందుకున్నాడు.

కవీశ్వరుడు ఇంతలో తేరుకున్నాడు. " ఎందుకాపడం ? కానివ్వండి " అని బిగ్గరగా అరిచి నటులకు సౌంజ్ఞ చేశాడు. నటులు ఈమారు గొంతుచించుకుని 'చదవ'నారంభించారు. కవి నెవరో భుజం తట్టినట్లయింది. వెనుతిరిగి చూశాడు.

"ఇంకా వుందా నాటకం ?"

"అయిపోయిందా ? "

కవికి రోషం వచ్చింది. పళ్లు పటపట కొరికాడు. నటుల కంఠధ్వనులు బిగ్గరగా వినరావడంవల్ల ప్రేక్షకులు అటు తిరిగారు. కాని అప్పటికే అందరికీ కథలో ఆసక్తి నశించింది. అయినా నటులు విశ్రాంతినుంచి లేచారు. 'బంగారుచేప' నెవరికివ్వాలి అని తర్కించారు. 'బంగారు చేప' గుణగణాలను ప్రశంసించి అర్హులెవరై ఉంటారని యోచించారు. నటులకు ఇంత వ్యవధి పట్టుతున్నదే కాని చివరికి వారెవరిని నిర్ణయిస్తారో ప్రేక్షకులప్పుడే గ్రహించారు. ఆమె ఫ్లాండర్స్ రాకుమారి ! అయితే నాటకం ఇంకా అంతవరకూ సాగలేదు. మధ్యలో మరొక అవాంతరం వచ్చింది. అతిథుల వేదిక వెనుకద్వారం తెరుచుకుంది. బూర్బోన్ కార్డినల్ ఠీవిగా ప్రవేశించారు. ప్రతీహారి బిగ్గరగా ప్రకటించాడు. ప్రేక్షకులందరూ వేదికవైపు తిరిగారు. నటులు ఆగిపోయారు.

3

పియర్ గ్రాంగ్వార్‌కి పాపం తలపై పిడుగుపడినట్లయింది. నిశ్చేష్టుడై నిలబడిపోయాడు. అంటే కార్డినల్ పట్ల అతడికి భక్తి విశ్వాసాలు లేవని అర్థం కాదు; భీతి అనీ కాదు. గ్రాంగ్వార్ సహజంగా ఓర్మి కలవాడే. ఉన్నతుల సమక్షంలో ఒదిగి నడుచుకోడం అతడికి తెలుసును. రచయితలకు సమాజంలోకల ఉన్నత స్థానంవల్ల భయపడవలసిన కారణం లేదని అతడికి తెలుసు. తన కవిత్వం కార్డినల్ చెవిలో పడాలనే అతడూ కొరేది. శ్లేషద్వారా, వ్యంగ్యం ద్వారా ఫ్రాన్స్ రాజవంశాన్నీ, రాజబంధువుల్నీ, మతాధికారుల్నీ ప్రశంసిస్తూ అతడు వ్రాసిన కవిత్వం వింటే కార్డినల్ ఉప్పొంగుతాడని గ్రాంగ్వార్ భావన. అయితే స్వార్థాశయం ఒక్కటే కవుల రచనకు ఆధారమని చెప్పడంలేదు. ఒకపాలు స్వార్థాశయం ఉంటే తొమ్మిదిపాళ్ళు స్వాతిశయం ఉంటుంది. ఇంతమంది ప్రజ, ఇటువంటి ఉన్నతాధికారులు తను రచించిన నాటకాన్ని ఆసక్తితో వీక్షించడం అతడికి గర్వకారణమే.

అయితే అకస్మాత్తుగా మధ్యలో నాటకప్రదర్శనం నిలిచిపోవడం, నటీనటులు నటన మాని రంగస్థలంపైన నిలబడిపోయి నోళ్లు తెరుచుకుని చూడ్డం నాటకకర్తకు ఆశనిపాతమయింది. కార్డినల్ ప్రవేశంతో రసవత్తరమైన ఘట్టానికి అంతరాయం కలిగింది. అందరూ తలలెత్తి వేదికవైపు చూస్తున్నారు.

బూర్బోన్ కార్డినల్ రూపసి. కార్డినల్ ఫ్రెంచి మహారాజు బంధువు. అధికారదర్పం అతడి ముఖంలో ఉట్టిపడుతూ ఉంటుంది. ఉత్సాహవంతుడు, విలాసపురుషుడు. చుట్టూ ఎప్పుడూ పరివారం ఉంటారు. ఇతడిపట్ల ప్రజలకు కొంత ప్రశంసాభావం లేకపోలేదు. కార్డినల్ రాకముందే నాటకం ప్రారంభమైనప్పటికీ అతడు కోపించలేదు. ప్రజలు తమ ఆధిక్యం మన్నించబడినందుకు తృప్తి చెందారు.

కార్డినల్ వేదికముందుకు వచ్చి ప్రసన్నభావంతో ప్రేక్షకులనొకసారి కలయ చూశాడు. కార్డినల్ వెంట రకరకాల దుస్తులు ధరించిన మతాధికారులు, రాజబంధువులు వచ్చారు. వారితోనే ఫ్లాండర్స్ రాయబారులు ప్రవేశించారు. ప్రేక్షకులు వీరిపట్ల నిర్లక్ష్య భావం చూపకపోలేదు. ఈరోజు బికారులూ, సామాన్యజనంతో పాటు విద్యార్థులు, గుమస్తాలు, చిల్లరవర్తకులు, యువకులు, అందరూ సభ్యత, నియమాలు, గౌరవమర్యాదలకు తిలోదకాలిచ్చి విశృంఖల ప్రవర్తనకులోనై పండుగలో పాల్గొంటారు. నేటి ఉత్సవంలో అవినీతి, నిషేధం అనేవి పాటించనవసరం లేదు. ఇంక మతాధికారిని మన్నించాలనే నిర్బంధం కూడా అనవసరమే. ఎవరేమి అన్నా, ఎవరు దూషించినా ఇటువంటిరోజున అధికారులు కనీవిననట్లు తప్పించుకు తిరుగుతారు.

కార్డినల్ తన అతిథుల సత్కారం గమనించడంలో నిమగ్నుడైనాడు. ఈ అతిథుల ప్రవర్తన చూసి రెండురోజులుగా కార్డినల్ విసుగుచెంది ఉన్నాడు. అధికారంలో కాని, సామాజిక వ్యవస్థలో కాని అతిథులు కార్డినల్‌తో పోల్చడానికి అర్హులు కారు. వారిని సత్కరించడం అతడికి బాధ కలిగించింది. అతిథివర్గంలో రకరకాల వారున్నారు. చివరికి ఫ్లాండర్స్ రాజుగారి దర్జీ కూడా అతిథిగా రావడం మరింత చిరాకు కలిగించింది. ప్రతీహారి అతణ్ణి మొదట అటకాయించాడు. తరువాత ప్రధానరాయబారి కోపించగలడనే భయంతో దర్జీనికూడా రానిచ్చారు. ఇతడి పేరు జాక్ కోపెనోలా.

అతిథులందరూ ఆసీనులైనారు. కోపెనోలా ఒకసారి ప్రేక్షకులవంక చూశాడు. ఇతడు పారిస్ నగరంలో సామాన్య జనులకు పరిచితుడే. వారిలో ఒకడుగా ఇంతకాలం సంచరించిన కోపెనోలా రాజమర్యాదలందుకోవడం కొందరికి హర్షం కలిగించింది; కొందరు అపహాస్యం చేశారు. సిపాయిలను చూసి తప్పుకు తిరగవలసిన సామాన్యుడొకడు నేడు కార్డినల్ ఆతిథ్యం పొందాడు. కార్డినల్ అవమతి ఇంతటితో అంతం కాలేదు.

కోపెనోలా సగర్వంగా కార్డినల్‌కి అభివాదం చేసి నిలబడ్డాడు. వేదిక ముందుకు వచ్చి క్రింద ప్రేక్షకులను పరికించాడు. ఈ సమయానికి వేదిక క్రింద వేలాడుతున్న బికారి పైకి చూశాడు. కోపెనోలా అతణ్ణి తట్టి "క్లోపిన్" అని పలుకరించాడు. బికారి ముఖంలో హర్షం వెల్లివిరిసింది. మిత్రుని గుర్తించాడు. ఇద్దరూ సంభాషణకుపక్రమించారు. సభామందిరంలో గుసగుసలు, ఆక్షేపణలు అధికమైనాయి. కార్డినల్ ముఖంలో రోషం కనపడింది; పెదవులు కొరికాడు; కాని అతిథులనవమానించలేదు.

రంగస్థలం నిశ్చలంగా ఉంది. కవి ముఖం పాలిపోయి ఉంది. సద్దుమణిగిన తరువాత నాటకం కొనసాగించడానికి కవి అనుమతి కోరాడు.

"వొద్దు వొద్దు " అన్నారు కొందరు.

"కానివ్వండి" అన్నాడు కవి.

"అప్పుడే మొదలు పెట్టేశారా ?" అన్నాడొక అతిథి.

కార్డినల్ పకాలున నవ్వాడు ; "అయిందల్లా మంచిదే. కొంత తలనొప్పి తప్పింది" అన్నాడు.

"తిరిగి ఆరంభించమంటారా"

"మిగిలిందే కానివ్వండి" అన్నాడు కార్డినల్.

నటులు తిరిగి సంభాషణ ప్రారంభించారు. కవీశ్వరునికి తిరిగి ఆశ మొలకెత్తింది. కాని ఈ మారుకూడా ఆశాభంగం కలగడానికి అట్టేసేపు పట్టలేదు. అతిథులను గురించిన గుసగుసలు సభలో చెలరేగాయి. రంగస్థలంమీదికి సౌందర్యాధిదేవత అయిన 'వీనస్' వచ్చింది – 'బంగారుచేప' తనకు చెందాలని ఆమె వాదం. ఇంతలో బంగారు నగిషీలు పొదిగిన తెల్ల ముఖమల్ దుస్తులు ధరించిన ఒక చిన్న బాలిక వచ్చింది. ఫ్లాండర్స్ రాకుమార్తెకీమె ప్రతినిధి అన్నమాట.

బంగారు చేపకోసం – అనగా ఫ్రెంచి రాకుమారునికోసం – వీనస్‌కీ, ఫ్లాండర్స్ రాకుమారికీ తగవు తీరలేదు. ఇంక క్రీస్తుదేవుని తల్లి – మేరీ కన్య–తీర్పు చెప్పవలసిందే. తీర్పు రాకుమారిపరంగానే జరిగిపోయిందని అందరికీ తెలుసు.

ఇంత జరుగుతున్నా ప్రేక్షకులు ఆసక్తి చూపలేకపోతున్నారు. కవీశ్వరుని గుండె ప్రయ్యలౌతోంది.

ఇంతలోనే మరొక అంతరాయం సంభవించింది. అతిథి కోపెనోలా లేచి వేదికపైనుంచే ప్రేక్షకుల్ని సంబోధించి ఉపన్యసించనారంభించాడు. ప్రేక్షకుల కోలాహలంలో ఉపన్యాసం కొంత వినపడలేదు. కోలాహలం తగ్గగానే ఇలా చెప్పాడు; "అక్కడ రంగస్థలంమీద ఏం జరుగుతోందో ఏం తెలియడంలేదు. అక్కడ వాళ్లెందుకు

End of Preview.

Rest of the book can be read @

http://kinige.com/kbook.php?id=392